# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 19-08-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పీ4 అమలు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ప్రారంభించారు.
- ❖ సామాజిక మాధ్యమాలలో అసత్య ప్రచారాలు చేసే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోనుందని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు.
- ❖ కేంద్ర కార్మిక శాఖా మంత్రి మన్సుక్ మాండవీయతో నర్సాపురం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఈరోజు సమావేశమై అమరావతిలో 650 పడకల ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.
- ❖ వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ఒడిశాలోని గోపాల్‌పూర్‌కి సమీపంలో ఈరోజు ఉదయం తీరం దాటిందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================

పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పీ4 అమలు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ప్రారంభించారు. బంగారు కుటుంబాలు - మార్గదర్శులతో ఈ సందర్భంగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ.. ఉగాది రోజు లాంఛనంగా ప్రారంభించిన ఈ పీ4 కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు ప్రభుత్వం బంగారు కుటుంబాలు, మార్గదర్శుల ఎంపిక ప్రక్రియ చేపట్టిందన్నారు. పీ-4లో దాదాపు 13 లక్షల బంగారు కుటుంబాలను గుర్తించామని మార్గదర్శులుగా లక్ష 40 వేల మంది పారిశ్రామిక వేత్తలు, ప్రవాసాంధ్రులు ముందుకొచ్చారని తెలిపారు. మార్గదర్శుల చేయూతను బంగారు కుటుంబాలు అందిపుచ్చుకోవాలన్నారు. పీ4 కార్యక్రమం ద్వారా దత్తత తీసుకోవడం పూర్తి స్వచ్ఛందమే అని.. దీనిలో ఎలాంటి ఒత్తిడి లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేస్తూ....

(వాయిస్ 30 సెకన్లు)

=====================

సామాజిక మాధ్యమాలలో అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించి అభద్రతా భావానికి గురిచేసే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోనుందని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. దీనిపై రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఒక ప్రత్యేక చట్టాన్ని కూడా తీసుకురాబోతున్నామని వెల్లడించారు. ఈరోజు రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై అవాస్తవాలను ప్రచారం చేసే వారిపై ప్రభుత్వం చర్యలు చేపట్టనుందని స్పష్టం చేశారు. అంతేగాక ప్రత్యేకంగా ఒక నిజ నిర్ధారణ కమిటీని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసి వాస్తవాలేమిటో ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడి ప్రభుత్వం అన్ని పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందిస్తోందని హోం మంత్రి అనిత వివరిస్తూ....

(వాయిస్ 35 సెకన్లు)

=====================

కేంద్ర కార్మిక, యుజన వ్యవహారాల శాఖా మంత్రి మన్సుక్ మాండవీయతో నర్సాపురం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఈరోజు సమావేశమై అమరావతిలో 650 పడకల ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈరోజు ఆయన న్యూఢిల్లీలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ తో కలిసి మన్సుక్ మాండవీయను కలిశారు. పల్నాడు, గుంటూరు, శ్రీసిటీలలో 100 పడకల ఆసుపత్రులు, కర్నూలులో 30 పడకల ఆసుపత్రిని ఈఎస్ఐ ద్వారా ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కోరారు. అదే విధంగా రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయల కల్పన, అభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. ఖేలో ఇండియా పథకం కింద కొనసాగుతున్న ప్రాజెక్టులను పూర్తి చేయడానికి నిధులను విడుదల చేయాలన్నారు. రాయలసీమ ప్రాంతంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

=====================

మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్న "స్త్రీ శక్తి" పథకం ప్రభుత్వానికి భారం కాదని బాధ్యత అని రవాణా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఘాట్ రోడ్లలో కూడా ఈ పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామన్నారు. గుర్తింపు కార్డుగా ఆధార్, పాన్ కార్డ్, ఓటర్ కార్డుల జెరాక్సులు, సాఫ్ట్ కాపీలను కూడా అనుమతిస్తున్నామని చెప్పారు. దిగ్విజయంగా అమలవుతున్న స్త్రీ శక్తి పథకంపై విపక్షాలు అసత్య ప్రచారం చేయడం తగదన్నారు.

విరామం

=====================

భూముల రీ సర్వే, మ్యుటేషన్ల ప్రక్రియలో జాప్యం చేస్తే రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకుంటామని అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ హెచ్చరించారు. ఈరోజు కలెక్టరేట్ నుండి 22 మండలాల తహశీల్దారులు, సర్వే అధికారులతో ఆయన దృశ్య మాధ్యమంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 31లోగా 108 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. హౌస్ సైట్ పట్టాలను పునఃపరిశీలించాలన్నారు. "అన్నదాత సుఖీ భవ" సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధన్యత ఇవ్వాలన్నారు. ఇక వరద ప్రభావిత ప్రాంతాలలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, చింతూరు డివిజన్ లో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసారని తెలిపారు. అవసరమైన చోట సహాయ పునరావాస కార్యక్రమాలను చేపట్టాలని అధికారులకు సూచించారు.

=====================

దివ్యాంగుల పెన్షన్ అప్పీల్ ప్రక్రియకు అనర్హులుగా నోటీసు అందుకున్న వారు తాము అర్హులమని భావించినట్లయితే, తమ సమీప మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) లేదా మునిసిపల్ కమిషనర్ను సంప్రదించి, అర్జీని సమర్పించవచ్చని ద్వితీయ ఆరోగ్య విభాగం సంచాలకులు ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు ఆ అర్జీలను

పెన్షన్ పోర్టల్లో అప్లోడ్ చేసి, తదుపరి కార్యాచరణ చేపడతారని స్పష్టం చేశారు. షెడ్యూల్ ప్రకారం ఆసుపత్రికి హాజరుకావాలని కోరుతూ మరో నోటీసు కూడా జారీ చేయబడుతుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సమీప గ్రామ, వార్డ్ సచివాలయ అధికారులను సంప్రదించాలని సూచించారు.

=====================

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈ సంవత్సరం సెప్టెంబర్ 24 నుండి అక్టోబర్ 02 వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో, తిరుమలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నీటి నిల్వలు సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) అదనపు కార్యనిర్వహణ అధికారి సిహెచ్ వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు.

=====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈ నెల 29వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

=====================

ఆసియా కప్ 2025 కోసం బీసీసీఐ ఈరోజు భారత్ క్రికెట్ జట్టుని ప్రకటించింది. యూఏఈ వేదికగా ఆసియా కప్ సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు టీ20 ఫార్మాట్లో జరగనుంది. ఈ నేపథ్యంలో బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తదితరులు ఈరోజు ముంబైలో సమావేశమై 15మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించారు. శుభ్‌మన్ గిల్‌ను టీ20 జట్టుకి వైస్ కెప్టెన్‌గా నియమించారు.

=====================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 81,273 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమై.. చివరికి 371 పాయింట్లతో 81,644 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 103 పాయింట్ల లాభంతో 24,980 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.95గా ఉంది.

=====================

వాయవ్య పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ఒడిశాలోని గోపాల్‌పూర్‌కి సమీపంలో ఈరోజు ఉదయం తీరం దాటిందని విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఉత్తరాంధ్రలో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్ర అధికారి జగన్నాథరావు తెలియజేస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

=====================
=====================